క్లుప్తంగా

అబాకస్‌తో గణితం సులభతరం



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎంఈఓ కోటయ్య

పాణ్యం: అబాకస్‌తో గణితం మరింతం సులభతరం అవుతుందని ఎంఈఓ కోటయ్య అన్నారు. శుక్రవారం పాణ్యంలోని కేఆర్‌ఆర్ పాఠశాలలో వేదిక్ మ్యాథ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు గణితం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అబాకస్ లాంటి వాటిల్లో శిక్షణ తీసుకోవడం వల్ల భవిష్యత్‌లో గణితంపై పట్టు సాధించవచ్చన్నారు. వేదిక్ మ్యాథ్స్ జోనల్ మేనేజర్ శివాంజనేయులు మాట్లాడుతూ.. అబాకస్ పోటీలకు జిల్లాలోని 35 పాఠశాలల నుంచి దాదాపుగా 550 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలో విజేతలైన వారికి ఫిబ్రవరి 9న తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసుదేవరరెడ్డి, నరేష్, దస్తగిరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కోడుమూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్ డివిజన్ డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లద్దగిరి, బురాన్‌దొడ్డి ఫీడర్లలో మరమ్మతులు, గూడూరు, సి.బెళగల్, కోడుమూరు సబ్‌స్టేషన్లలో మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున మూడు మండలాల పరిధిలో కరెంట్ కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


కొలతల మేరకు పనులు చేయాలి



అమడగుంట్లలో ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీఓ మోదీన్‌బాషా కూలీలకు సూచించారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేసి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 లభిస్తుందని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు, టెక్నికల్ సిబ్బంది ప్రతి రోజు కొలతలు ఇచ్చి ఆ ప్రకారం కూలీల చేత పనులు చేయించాలని, రెండు సార్లు కూలీల హాజరు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓ సిబ్బందిని ఆదేశించారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ



సి.బెళగల్‌లో ర్యాలీని నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి చేపట్టనున్న భూముల రీసర్వేపై మండల రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆధ్వర్యంలో రీసర్వే డీటీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులతో కలిసి ఆయన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు వీఆర్వోలు, సచివాలయ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలతో కలిసి ర్యాలీ నిర్వహించి, రీ సర్వే విషయాలను తెలియజేశారు. మండల రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు.

సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు సంక్రాంతి సెలవుల్లోనూ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాయని, అలాంటి వాటిపై ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అభి, అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సెలవుల్లో తరగతులను నిర్వహించే పాఠశాలలు, కళాశాలలను అధికారులు సీజ్ చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం అన్యాయమన్నారు. నాయకులు వర్ధన్, చందు, వెంకటేష్ పాల్గొన్నారు.



పాణ్యం: ప్రత్యేక అలంకరణలో వీరనారాయణ స్వామి




కోడుమూరు రూరల్: ప్రత్యేక అలంకరణలో గోరంట్ల శ్రీలక్ష్మీమాధవస్వామి



కోడుమూరు రూరల్: గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లు



పాణ్యం: ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



పాణ్యం: ముగ్గుతో వీరనారాయణస్వామి రూపం

వైకుంఠ ద్వార దర్శనం.. పులకించిన భక్తజనం

- ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు..
- పోటెత్తిన భక్తులు.. కిటకిటలాడిన ఆలయాలు
- క్రిష్ణాపురంలో వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

కోడుమూరు రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాలు తెరచుకుని ఉంటాయని, ముక్కోటి దేవుళ్లు శ్రీవారిని దర్శించుకుంటారని, ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయాలకు చేరుకుని ప్రార్థన చేస్తే సకల దేవతల అనుగ్రహంతో పాటు వైకుంఠ ప్రాప్తి లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భారీగా క్యూలైన్లలో వేచిఉన్నారు. దర్శనానికి గంటకుపైగా సమయం పట్టింది. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సీనియర్ రాజకీయ నాయకులు కోట్ల హరిచక్రపాణి రెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను గరుడ వాహనం ఆశీనులు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.



గడివేముల: వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి శ్రీనివాస స్వామి కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో అతి పురాతన శ్రీలక్ష్మివేంకటేశ్వర స్వామి ఆలయం పడమటి దిశలో ఉంటుంది. ఈ ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులు ఉదయాన్నే వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హరి నామస్మరణతో మార్మోగిన వైష్ణవక్షేత్రాలు

పాణ్యం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని వైష్ణవ క్షేత్రాలు హరి నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించడంతో ప్రజలు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో పాణ్యం వీరనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాటు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఏకాంతసేవ, అభిషేకాలు, అర్చనలు తదితర విశిష్ట పూజలు చేశారు. ఉత్తర ద్వారం వద్ద అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. అలాగే గోపూజ చేపట్టారు. భక్తులు గోవింద.. గోవిందా అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



సి.బెళగల్: శ్రీరంగనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

– అలాగే ఎస్సార్‌బీసీ కాలనీలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు భక్తుల తాకిడి కొనసాగింది.

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించారు. అలాగే సి.బెళగల్ రంగస్వామి ఆలయంలో స్వామి వారిని శ్రీనివాసుడి రూపంలో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామ సర్పంచ్ పాండురంగన్న పార్టీ సభ్యులతో కలిసి పూజలలో పాల్గొని అర్చన, అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలలో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గడివేముల: మండలంలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ బాలాజీ టెంపుల్‌లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. అలాగే భోగేశ్వరాలయంలో భక్తుల సందడి కనిపించింది. బూజునూరులోని వేంకటేశ్వరాలయంలో స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానం చేశారు. అలాగే పెసరవాయి, కొరటమద్ది గ్రామాలలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు.







కోడుమూరు రూరల్: గోరంట్ల శ్రీలక్ష్మీమాధవుడిని దర్శించుకునేందుకు వేచిఉన్న భక్తులు, గడివేముల: వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు ఓర్వకల్లు: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆర్జీఎంలో సెంట్రల్ లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ హెచ్.సుదర్శనరావు

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట సమీపంలో గల ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డిజిటల్ రోబో లైబ్రరీని జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ హెచ్.సుదర్శన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో మొట్టమొదటిసారిగా రోబోట్ ఆటోమేటిక్ సిస్టంతో పనిచేసే గ్రంథాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలు, డుస్సాన్ రోబోట్, డూ బాన్ రోబోట్, 3డీ ప్రింటర్ యుగాట్ రోబోట్, రోబోట్ వంటి సాంకేతిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలోని డేటా సైన్స్ ల్యాబ్, ఎలక్ట్రానిక్స్ మెకానికల్ తదితర ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రెండేళ్లుగా రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లింపులు నిలిచి పోయాయన్నారు. దాదాపు రూ.3 వేల కోట్ల బకాయిలు కళాశాలలకు అందాల్సి ఉందన్నారు. అలాగే విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ఎండీ మిద్దె శివరాం, వైద్యశాల ఎండీ మిద్దె రఘురాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్‌ఓడీ డాక్టర్ కిషోర్‌కుమార్, రవి శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ

కల్లూరు: చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ విద్యార్థులు మద్రాస్ ఐఐటీ వారు నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరీక్షల్లో ప్రతిభ చాటారు. అకాడమీ నుంచి జూనియర్ ఎంపీసీ విభాగానికి చెందిన 42 మంది విద్యార్థులు గురువారం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో నిర్వహించిన పరీక్షలో సర్టిఫికెట్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప తెలిపారు. అకాడమీకి చెందిన భరత్‌కుమార్ 98 శాతం మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచారన్నారు.అలాగే వంశీకృష్ణ 90 శాతం, మనోజ్ 88 శాతం మార్కులు పొందరన్నారు. ఈ సర్టిఫికెట్ విద్యార్థులకు భవిష్యత్తులో మల్టీనేషనల్ కంపెనీలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో ఉద్యోగం పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవి అకాడమీలో అధ్యాపకులను, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అకాడమీ డైరెక్టర్, అధ్యాపకులు

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

కోడుమూరు రూరల్: ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మందులు, ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఏఓ రవిప్రకాష్‌తో కలిసి కోడుమూరులోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను వారు పరిశీలించారు. ఏడీఏలు మాట్లాడుతూ.. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిఉండాలని, ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కన్నా అధిక ధరకు ఎరువులు, మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. స్టాక్, ఎమ్మార్పీ ధరలను దుకాణం వద్ద బోర్డుపై ప్రదర్శించాలన్నారు. కాలం చెల్లిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు విక్రయించరాదన్నారు. రైతులు కొన్న ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి పంటలకు అవసరమైన మందులను మాత్రమే పంటలకు పిచికారీ చేసుకోవాలన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు

బాలికల క్రికెట్ జట్టుకు అభినందన

కర్నూలు (టౌన్): ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని నాగర్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం బాలికల క్రికెట్ జట్టును జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్ తన చాంబర్‌లో అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో విద్యార్థినులు విజేతగా నిలవడం శుభపరిణామమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచాయని, క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సన్మానం



ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంను సన్మానిస్తున్న వీఆర్వోలు

సి.బెళగల్: మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత అవసరాలతో ఈ నెల 20వ తేదీ వరకు సెలవులో వెళ్లడంతో ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ పురుషోత్తంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మండల వీఆర్వోలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను కలిసి శాలువా, పూలమాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్వోలు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పురుషోత్తంను విజ్ఞప్తి చేశారు. వీఆర్వోలు శ్రీనివాసులు, అక్బర్‌హుసేన్, రఫి, శేఖర్, రంగముని, తిమ్మన్న, సాయిరమణ, మంజీర, వెంకటేశ్వర్లు, అలీఫ్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

పాణ్యం/కోడుమూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ మండలాధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

పాణ్యం నియోజకవర్గంలో..

మండలం	అధ్యక్షుడి పేరు
పాణ్యం	కె.కరుణాకర్‌రెడ్డి
గడివేముల	బొంతలమధుసూదన్
కల్లూరు	వై.రామకృష్ణారెడ్డి
ఓర్వకల్లు	ఎస్.చెన్నారెడ్డి

కోడుమూరు నియోజకవర్గంలో..

మండలం	అధ్యక్షుడి పేరు
కోడుమూరు	జి.రమేష్ నాయుడు
సి.బెళగల్	ఆర్.సోమశేఖర్ రెడ్డి
గూడూరు	ఎల్.రామాంజినేయులు
కర్నూలు	పి.మోహన్‌బాబు

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలని ఆ బ్యాంకు యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీనగర్‌లోని పొదుపు మహిళల సమావేశంలో సంఘం కార్యాలయంలో జరిగింది. వారు మాట్లాడుతూ.. మెప్మా ఆర్పీలకు వేతనాలు పెంచాలని కోరారు. ఏపీజీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించే కుట్రను అడ్డుకోవాలన్నారు. పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వారందరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. కర్నూలు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన టి.ఎం.డి ఫిరోజ్ శుక్రవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి పదవులు వరిస్తాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వాలి

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, స్థలాలున్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబిరసూల్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, స్థలాలివ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నబిరసూల్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడు నెలలైనా పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, ఫక్రుద్దీన్, లక్ష్మన్న, సురేష్, ఆదినారాయణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



గూడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోడుమూరులో..

మండలంలోని గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, స్థలాలివ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మాధవస్వామి, సీపీఐ మండల కార్యదర్శి రాజు, స్థానిక నాయకులు మధు, సుంకన్న, బజారి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు గ్రామ నడిబొడ్డున ప్రధాన వీధి మురుగునీటితో బురదమయంగా మారిందని సీపీఎం ఏపీ వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మురుగు కాల్వలు నిర్మించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్య.కా.స నాయకులు నాగన్నతో పాటు, కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకృష్ణ గ్రామంలో పర్యటించి, మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సచివాలయం ఎదురుగా ప్రధాన రహదారిలో మురుగు నీటి నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ప్రజలు సచివాలయానికి వెళ్లాలంటే మురుగు నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్య పరిష్కరించాలని, అలాగే ఎస్సీ కాలనీలో మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మురుగు నీటిని చూపుతున్న వ్య.కా.స నాయకులు

డాక్యుమెంట్స్ పోయినవి

A.క్రిష్ణమూర్తి, Age: 50, S/o ఆకెపోగు బజారు, ఇ.నెం: 2-134, లక్ష్మీపురం గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా. నాకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం: 2192/1990 (సర్వే నెం: 96, విస్తీర్ణం: 50 సెంట్లు కల్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్) పోయినవి. లక్ష్మీపురంలోని మా ఇంటి నుంచి చిన్నటేకూరు గ్రామానికి బైక్ మీద వెళుతుంటే పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రిందికి నెంబర్‌కు సంప్రదించగలరు. తగిన పారితోషికం కూడా ఇవ్వబడును.

Cell: 87904 32058